
సాక్షి
పల్నాడు
బుధవారం, 1, మార్చి, 2023



3 నుంచి నీటి విడుదల

గుంటూరు వెస్ట్: నాగార్జునసాగర్ కుడి కాలువకు కేటాయించిన నీటిని మార్చి 3 నుంచి విడుదల చేస్తామని సహాయ కార్యనిర్వాహక ఇంజినీర్ ఎం.మురళీధర్ ఒక ప్రకటనలో తెలిపారు.



7 నుంచి పెనుగంచిప్రోలు తిరునాళ్ల

ఎన్టీఆర్ జిల్లా: పెనుగంచిప్రోలు తిరుపతమ్మ అమ్మవారి చిన్న తిరునాళ్ల మహోత్సవాలు మార్చి ఏడు నుంచి 11వ తేదీ వరకు అంగ రంగ వైభవంగా జరగనున్నాయి.




ఉత్సాహంగా కబడ్డీ పోటీలు

జగ్గయ్యపేటలో జరుగుతున్న రాష్ట్రస్థాయి మహిళా ఆహ్వాన కబడ్డీ పోటీలు ఉత్కంఠభరితంగా జరుగుతున్నాయి. నేడు సెమీస్, ఫైనల్ పోరు జరగనుంది.

ప్రజా 'కర్షక' ప్రభుత్వం

తెనాలి రైతుభరోసా సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



బటన్ నొక్కి రైతు భరోసా సాయాన్ని రైతన్నల ఖాతాల్లో జమ చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వేదికపై మంత్రులు విడదల రజిని, కాకాణి, మేరుగ, ఎంపీ మోపిదేవి, ఎమ్మెల్యేలు అన్నాబత్తుని శివకుమార్, కిలారి వెంకటరోశయ్య, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, గోపిరెడ్డి, ఎమ్మెల్సీలు జంగా, పోతుల సునీత

- నాలుగేళ్లలో కరువన్నది లేదు
- ప్రతి రైతు కుటుంబానికి భరోసా
- తెనాలిలో సీఎం సభ సూపర్ సక్సెస్

సాక్షి ప్రతినిధి, గుంటూరు, తెనాలి: 'ఇది దేవుడు దీవించిన ప్రభుత్వం. మనందరి ప్రభుత్వం రైతులకు అండగా ఉండటాన్ని దేవుడు చూశాడు. దేవుడు విన్నాడు, దేవుడు దీవించాడు.' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ ఆర్థిక సాయం, మాండస్ తుఫాన్‌కు పంటలు నష్టపోయిన రైతులకు పెట్టుబడి రాయితీ విడుదలకు మంగళవారం తెనాలిలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రైతు భరోసా పథకం కింద నాలుగేళ్లు కూడా గడవకమునుపే రైతన్నలకు అందించిన సాయం రూ.27,062 కోట్లని తెలిపారు. రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం అంటే ఇది అన్నారు. వ్యవసాయం బాగుంటేనే రైతు బాగుంటాడు. రైతు, రైతు కూలీలు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది. మంచి మనసు, మంచి పాలన ఎక్కడైతే ఉంటుందో అక్కడ దేవుడి ఆశీసులు కూడా కచ్చితంగా ఉంటాయని ఈ నాలుగేళ్లలో నిరూపణ అయ్యిందన్నారు.

సభ విజయవంతం..

తెనాలి బహిరంగ సభ అంచనాలకు మించి విజయవంతమైంది. జనం నిండిపోవడంతో వేలాది మంది టెంట్ల బయట, యార్డు పరిసరాల్లో నిలుచునే కార్యక్రమం వీక్షించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కిలోమీటరు పొడవునా రోడ్డుకు ఇరువైపులా వేచి ఉన్న ప్రజలు పూలవర్షంతో ఘనస్వాగతం పలికారు. యార్డు ప్రాంగణంలో వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సీఎం సందర్శించారు. వివరాలను రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, రైతు భరోసా కేంద్రాల ముఖ్యకమిషనర్ గోపాలకృష్ణ ద్వివేది, వ్యవసాయశాఖ ప్రత్యేక కమిషనర్ హరికిరణ్ తెలియజేశారు. లబ్ధిదారులతో ఫొటో దిగిన అనంతరం బహిరంగ సభా వేదికపైకి చేరుకున్నారు. గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి స్వాగతోపన్యాసం చేశారు. స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రారంభోపన్యాసం చేసిన అనంతరం వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రసంగించారు. రైతుల తరఫున రేవేంద్రపాడుకు చెందిన మహిళా కౌలు రైతు వలుకూరి మేరిమ్మ మాట్లాడారు. సెంటు భూమి లేని కౌలు రైతైన తనకు, కౌలురైతు కార్డు నుంచి రైతు భరోసా నుంచి అందుతున్న సంక్షేమ పథకాల వివరాలను సంతోషంగా అందరితో పంచుకున్నారు.

సీఎం ప్రసంగానికి అద్భుత స్పందన..

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేసిన ప్రసంగానికి ఆద్యంతం అద్భుత స్పందన లభించింది. 'ఇప్పుడంతా రెయినే.. రెయిన్ గన్లతో పనిలేదు', 'కరువుకు కేరాఫ్ చంద్రబాబు'.. 'మన పాలనలో దేవుడు చూశాడు.. విన్నాడు.. దీవించాడు..', 'ఒక్క మండలం కూడా కరవు మండలంగా ప్రకటించలేదు' అన్నప్పుడు హర్షధ్వానాలతో సభ మార్మోగింది. అనంతరం బటన్ నొక్కి రైతులకు రైతు భరోసా, పీఎం కిసాన్ ఆర్థిక సాయం, ఇన్‌పుట్ సబ్సిడీని విడుదల చేశారు. ఆయా చెక్కులను రైతు లబ్ధిదారులకు అందజేశారు.

సంబరపడ్డ అభిమానం



ముఖ్యమంత్రికి జ్ఞాపికను బహూకరిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్, ఆయన తనయుడు

ముఖ్యమంత్రికి స్థానిక నేతలు జ్ఞాపికలు అందజేసి సంతోషాన్ని చాటుకున్నారు. ఎమ్మెల్యే శివకుమార్ పెద్ద కుమారుడు అన్నాబత్తుని సత్యనారాయణ పార్టీ సింబల్‌తో కూడిన వెండి సూర్యరథాన్ని బహూకరించారు. తెనాలి మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ అవుతు సీతనగేష్‌రెడ్డి ప్రత్యేకంగా తయారు చేయించిన నాగలి, చెర్నాకోలును అందజేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు తాడిబోయిన రమేష్, బూరెల దుర్గాప్రసాద్ నెమలి పింఛపు గజమాల, వెండిప్లేటును బహూకరించారు. తెనాలి ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు భగవద్గీతను అందజేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్, కొల్లిపర భీమవరపు పద్మావతి, తెనాలి జెడ్పీటీసీ పిల్లి ఉమాప్రణతిని ప్రత్యేకంగా పలకరించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రైతు లబ్ధిదారులతో దిగిన ఫొటోను సభ ముగిశాక జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి సీఎంకు బహూకరించారు. శ్రీకళ్యాణి కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ, తెనాలి సత్యగురువు చల్లా బాలత్రిపురసుందరి శిష్యబృందం, బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు, బాలుర ఉన్నత పాఠశాల, అంగలకుదురు జిల్లా పరిషత్ హైస్కూల్, కొలకలూరు జూబ్లీ స్కూల్ విద్యార్థులతో సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు, ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్సీలు డొక్కా మాణిక్యవరప్రసాద్, లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురాం, మర్రి రాజశేఖర్, జంగా కృష్ణమూర్తి, మురుగుడు హనుమంతరావు, పోతుల సునీత, ఎమ్మెల్యేలు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, కోన రఘుపతి, మేకతోటి సుచరిత, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కిలారి వెంకట రోశయ్య, మహమ్మద్ ముస్తఫా, టీటీడీ పాలకవర్గం సభ్యుడు దాసరి కిరణ్‌కుమార్, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు, జిల్లా జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, తెనాలి సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ వేదికపై ఉన్నారు.



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నెమలి పింఛాలతో చేసిన గజమాలతో సత్కరిస్తున్న ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, మంత్రులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మేరుగ నాగార్జున, నాయకులు

న్యూస్‌రీల్

మేకలగొంది వద్ద రూ.1200 కోట్లతో తాగునీటి ప్రాజెక్టు



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ విజయపురి సౌత్ పరిధిలోని మేకలగొంది వద్ద రూ.1200 కోట్ల వ్యయంతో తాగునీటి ప్రాజెక్టుకు సర్వే పనులు ప్రారంభించినట్లు పల్నాడు జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఆర్ఎస్ఆర్ సురేష్ తెలిపారు. మంగళవారం నాగార్జునసాగర్ జలాశయం మేకలగొంది ప్రాంతాన్ని ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాబార్డ్, జలజీవన్ మిషన్ పథకాల ద్వారా ఈ ప్రాజెక్టు నిర్వహణ జరుగుతుందని చెప్పారు. మాచర్ల, గురజాల, వినుకొండ, నరసరావుపేట, సత్తెనపల్లి, పెదకూరపాడు ప్రాంతాలకు తాగునీటి అవసరాలు తీర్చటమే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశమన్నారు. ఇప్పటికే టెండర్ పక్రియ పూర్తయిందని, రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. మరో పది, పదిహేను రోజులలో సర్వే పనులు పూర్తి అవుతాయని, నెల రోజుల్లో వాటర్‌గ్రిడ్ పనులు మొదలవుతాయని పేర్కొన్నారు. మాచర్ల ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ గోపాల్, పిడుగురాళ్ల డీఈ అలెక్స్, వినుకొండ డీఈ రాజు, నరసరావుపేట డీఈ ఏడుకొండలు, సాగర్ ప్రాజెక్టు ఏఈ బాబుమియా పాల్గొన్నారు.

యార్డులో 1,12,869 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 1,15,935 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,12,869 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ.22,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.26,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.13,000 వరకు ధర దక్కింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 90,677 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

నెహ్రూనగర్(గుంటూరు): వైఎస్సార్ పింఛన్ కానుకను బుధవారం నుంచి వలంటీర్లు జిల్లాలో పంపిణీ చేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా మార్చి నెలకు 2,53,235 మంది లబ్ధిదారులకు రూ.69.58 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. బుధవారం తెల్లవారుజాము నుంచి వలంటీర్లు లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి పింఛన్ అందజేయనున్నారు.

గుంటూరు రైల్వే డివిజన్ మీదుగా పలు ప్రత్యేక రైళ్లు

సీనియర్ డీసీఎం ఆంజనేయులు

లక్ష్మీపురం(గుంటూరు): దక్షిణ మధ్య రైల్వే ప్రయాణికుల సౌకర్యార్థం గుంటూరు రైల్వే డివిజన్ మీదుగా పలు ప్రత్యేక రైళ్లను కేటాయించడం జరిగిందని సీనియర్ డీసీఎం ఆంజనేయులు మంగళవారం వెల్లడించారు. మచిలీపట్నం – కర్నూలుసిటీ వయా గుంటూరు డివిజన్ మీదుగా రైలు నంబరు 07067ను మార్చి 2 నుంచి 30వ తేదీ వరకు ప్రతి మంగళ, గురు, శనివారాల్లో కేటాయించినట్లు వెల్లడించారు. మార్చి 3 నుంచి 31వ తేదీ వరకు ప్రతి ఆది, బుధ, శుక్రవారాల్లో కర్నూలు సిటీ – మచిలీపట్నం (రైలు నెంబర్ 07069)కు ప్రత్యేక రైలును కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈ రైలు గుడివాడ, విజయవాడ, గుంటూరు, నరసరావుపేట, దొనకొండ, మార్కాపురం, కంభం, గిద్దలూరు, నంద్యాల, డోన్ మీదుగా ప్రయాణిస్తుందని తెలిపారు. ఈ రైలుకు టూటైర్, త్రీటైర్ ఏసీ, స్లీపర్ క్లాసులు, జనరల్ కోచ్‌లు కేటాయించినట్లు పేర్కొన్నారు.

ఉపాధి కల్పనే ధ్యేయంగా కృషి



బాపట్ల: యువతకు ఉపాధి అవకాశాల కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి.సుధాకర్ పేర్కొన్నారు. బాపట్లలోని సాల్వేషన్ ఆర్మీ ఐటీఐ కళాశాలలో మంగళవారం జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు 52 మంది నిరుద్యోగులు హాజరుకాగా వారిలో 22 మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి రత్నభూషణం, జిల్లా ప్లేస్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ డి.రమేష్‌బాబు, జి.అనేష్‌బాబు, బుల్లయ్య, ప్రిన్సిపల్ కె.సందీప్, సూర్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా రైతులకు రూ.76.99 కోట్లు

రైతు భరోసా అందజేత

కలెక్టర్ ఎల్.శివశంకర్

నరసరావుపేట: పల్నాడు జిల్లాలోని 91,237 మంది రైతులకు వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ పథకం, ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.76.99 కోట్లను ముఖమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేశారు. మంగళవారం గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి వరుసగా నాల్గో ఏడాది మూడో విడత సహాయాన్ని బటన్ నొక్కి నేరుగా రాష్ట్రంలోని లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేసే కార్యక్రమాన్ని వర్చువల్ విధానంలో జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయిమార్కొండారెడ్డి, జిల్లా రైతులు కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి వీక్షించారు. అనంతరం జిల్లాలోని లబ్ధిదారులకు నమూనా చెక్కును కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఐ.మురళి, ఉద్యాన శాఖ అధికారి బీజే బెన్నీ, సహాయ వ్యవసాయ శాఖ అధికారి రవికుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పంట కుంటలు ఏర్పాటు చేసుకోవాలి

నరసరావుపేట: సాగునీరు కొరత ఉన్న గ్రామాల్లో రైతులు తమ పంట పొలాల్లో వర్షపు నీరు నిల్వ కోసం పంట కుంటలు ఏర్పాటు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పంట కుంటలు ఏర్పాటు చేసుకునేందుకు ఆసక్తి ఉన్న రైతుల జాబితాను ఆర్‌బీకేల ద్వారా తయారు చేయాలని ఆదేశించారు. వేసవిలో ఆర్‌బీకేల ద్వారా మట్టి నమూనాలను సేకరించాలని, వచ్చే ఖరీఫ్ 2023కు కావాల్సిన విత్తనాలు, ఎరువుల పరిమాణాన్ని అంచనా వేసి రైతులకు అందుబాటులో ఉంచే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. చైర్మన్ మార్కొండారెడ్డి మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం ప్రవేశపెట్టిన డాక్టర్ వైఎస్సార్ యంత్ర సేవా పథకాన్ని గ్రామంలోని సీహెచ్‌సీల ద్వారా వినియోగించుకోవాలని సూచించారు. చిరుధాన్యాల పంట విస్తీర్ణం పెంచాలని కోరారు. ప్రతి ఆర్‌బీకేలో సాయంత్రం సమయంలో రైతులకు వ్యవసాయ, అనుబంధ శాఖలు నిర్వహిస్తున్న కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి బీజే బెన్నీ, వివిధ శాఖల జిల్లా అధికారులు, సలహా మండలి సభ్యులు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

కౌలు రైతులందరికీ రుణాలిస్తేనే ఆర్థిక ప్రగతి

బ్యాంకర్ల సమావేశంలో జిల్లా కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్, పక్కన ఏజీఎం కార్తీక్, డీసీఎస్ కన్వీనర్ రవీంద్ర నాయక్

నరసరావుపేట: జిల్లాలోని బ్యాంకులన్నీ అర్హత కలిగిన కౌలు రైతులందరికీ ప్రభుత్వ లక్ష్యం మేరకు తప్పనిసరిగా వ్యవసాయ రుణాలు అందజేసి వారి ఆర్థిక ప్రగతికి తోడ్పడాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ కోరారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో డీసీసీ జిల్లా స్థాయి కమిటీతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేందుకు జిల్లాలోని ప్రతి కౌలు రైతుకు తప్పనిసరిగా రుణాలు అందించి వారిలో జీవన ప్రమాణాలను పెంచి ఆర్థిక పురోగతి సాధించేలా కృషి చేయాలన్నారు. నవోదయం ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి విద్యా, ఉపాధి, వ్యాపార అవకాశాలను కల్పిస్తూ పెద్ద ఎత్తున రుణాలను అందించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయా సామాజిక వర్గాల అభివృద్ధి కోసం చేస్తున్న కృషికి తగిన తోడ్పాటును అందివ్వాలని కోరారు. స్టాండప్ ఇండియా, పీఎంఈజీపీ, సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల స్థాపనకు బ్యాంకర్లు రుణాలు ఇచ్చి నిరుద్యోగ యువతకు తగిన ఉపాధి అవకాశాలను కల్పించాలన్నారు. వ్యవసాయ, పశుసంవర్ధకశాఖ, మత్స్యశాఖ, డీఆర్‌డీఏ, మెప్మా, ఇతర ప్రాధాన్యతా రంగాలకు పెద్ద ఎత్తున రుణాలను అందివ్వాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బ్యాంకు ఖాతాల ద్వారానే సంక్షేమ పథకాలకు పెద్దఎత్తున సాయం చేస్తున్నాయని గుర్తుంచుకోవాలన్నారు. అటువంటి పేదలను బ్యాంకర్లు గుర్తుంచుకొని రుణాలు అందజేసి తగిన సహకారం అందివ్వాలన్నారు. ఇప్పటికే చాలా బ్యాంకులు అందించిన రుణాలు రికవరీ కాకపోతే గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు, వలంటీర్లు బ్యాంకు అధికారులకు సహకారం అందిస్తారన్నారు. రుణాల రికవరీకి ఎంత ప్రాధాన్యతనిస్తున్నారో రుణాలు అందజేసేందుకు అంతే తోడ్పాటు అందివ్వాలన్నారు. నాబార్డు ఏజీఎం కేఆర్‌కే కార్తీక్ మాట్లాడుతూ బ్యాంకుల ద్వారా రుణాలు పొందిన వారు సకాలంలో స్పందించటం ద్వారా రైతులు, పేద ప్రజలకు మరింత మేలు చేసినవారవుతారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాలను చేరుకునేందుకు బ్యాంకర్లు తప్పనిసరిగా స్పందించాలన్నారు. డీసీఎస్ కన్వీనర్, యూనియన్ బ్యాంకు జిల్లా ఏజీఎం రవీంద్ర నాయక్, రిజర్వు బ్యాంకు జిల్లా అధికారి ప్రవీణ్, లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకటేశ్వర్లు, వ్యవసాయాధికారి ఐ.మురళి, ఉద్యానశాఖ అధికారి బీజే బెన్నీ, డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్, పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి కాంతారావు, జిల్లా మత్స్యశాఖ అధికారి సంజీవరావు, నవోదయం నోడల్ అధికారి సంజీవరావు, పలు శాఖల బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంపై విష ప్రచారం

- ముఖ్యమంత్రి సమావేశానికి జనరేటర్ తీసుకువెళ్తున్నారంటూ ప్రచారం
- పర్యటన ఏర్పాట్లలో నలుగురు మృతి అని ఎల్లో మీడియాలో కథనాలు
- అబద్ధానికి వంత పాడిన జనసేన నేత నాదెండ్ల మనోహర్

ఫ్యాక్ట్ చెక్

చేబ్రోలు: రాష్ట్రంలో ఎక్కడా ఏ సంఘటన జరిగినా దాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అంటగట్టి ప్రచారం చేయడం తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు, ఎల్లో మీడియాకు అలవాటుగా మారింది. సోమవారం ఉదయం చేబ్రోలు మండలం వడ్లమూడి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదమే ఇందుకు తాజా ఉదాహరణ. వడ్లమూడి గరువుపాలెం వద్ద సోమవారం రవాణా వాహనానికి జనరేటర్ కట్టుకొని తెనాలి వెళ్తుండగా మధ్యలో లింక్ ఊడిపోయి మహిళా కూలీలతో వెళ్తున్న ఆటో మీద పడటంతో ఇద్దరు మహిళలు మరణించారు. ఆటోలో ఉన్న మరి కొంతమంది మహిళలకు గాయాలయ్యాయి. చేబ్రోలు మండల పరిధిలోని సుద్దపల్లి గ్రామంలో ఆదివారం వడ్డెర సంఘం వారు మారెమ్మ తల్లి తిరునాళ్లను నిర్వహించారు. నిర్వాహకులు తెనాలి చాకలిపేటకు చెందిన గాయత్రీ లైటింగ్ నుంచి జనరేటర్‌ను రోజుకు రూ.2,500 అద్దెకు తీసుకువచ్చారు. జాతర అయిపోవడంతో ఉదయం తెనాలికి జనరేటర్‌ను చేర్చడం కోసం సుద్దపల్లి గ్రామానికి చెందిన కంకణాల వెంకటేశ్వరరావు బాడుగకు మాట్లాడుకున్నాడు. రవాణా వాహనానికి జనరేటర్‌ను కట్టుకొని తెనాలి బయలుదేరాడు. అతివేగంతో వాహనం నడపటం, డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా వాహనానికి కట్టిన లింక్ సక్రమంగా లేకపోవటంతో ఊడిపోయి మహిళా కూలీలు ప్రయాణిస్తున్న ఆటోపైకి దూసుకుపోయింది. ఆటో పల్టీలు కొట్టింది. వాస్తవాలను పక్కదారి పట్టించి ప్రమాదానికి కారణమైన జనరేటర్‌ను తెనాలిలో జరిగే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమావేశానికి తీసుకువెళ్తుండగా ప్రమాదం జరిగిందని, మహిళా కూలీలు మరణించడానికి వైఎస్సార్ సీపీ నాయకులే కారణమంటూ విష్రప్రచారం చేయటంతో పాటు ఎల్లో మీడియాలో కథనాలు ప్రచురించారు. ఇద్దరు మృతి చెందితే నలుగురు మరణించారని దీనికి కారణం ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల నేపథ్యంలోనే బలి తీసుకున్నారని ఎల్లో మీడియా చానల్స్ బ్రేకింగ్ న్యూస్‌తో ఊదరగొట్టాయి. మరోవైపు జనసేన నేత నాదెండ్ల మనోహర్ కూడా ఎల్లో మీడియా బ్రేకింగ్‌లకు స్పందించి ముఖ్యమంత్రిపై విమర్శలు చేశారు.

తెనాలిపై వరాల జల్లు

- అభివృద్ధి పనులకు రూ.43 కోట్లు కేటాయిస్తున్నట్టు ప్రకటన
- ఎమ్మెల్యే శివకుమార్ అభ్యర్థనలకు సీఎం సానుకూల స్పందన



తెనాలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెనాలికి పలు వరాలు ప్రకటించారు. వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ ఆర్థిక సాయం విడుదల, మాండస్ తుఫాన్‌కు పంటలు నష్టపోయిన రైతులకు పెట్టుబడి రాయితీని మంగళవారం తెనాలిలో విడుదల చేసిన సీఎం, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అభ్యర్ధనలను పరిగణనలోకి తీసుకున్నారు. ఆయన కోరిన పనుల కోసం రూ.43 కోట్లను కేటాయిస్తున్నట్టు వెల్లడించారు. ముందుగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ తెనాలి మున్సిపల్ భవనం శిథిలమైందని, నూతన భవనం నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఎస్సీ కాలనీల్లో శ్మశానవాటికల సమస్యను ప్రస్తావించారు. పట్టణంలో ముస్లింలకు షాదీఖానా, ఆరటి, పసుపు, కంద వంటి వాణిజ్య పంటలకు నెలవైన కొల్లిపరలో మినీ మార్కెట్ యార్డు ఆవశ్యకతను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దావులూరు అడ్డరోడ్డు నుంచి కొల్లిపరకు డబుల్ లైన్ రోడ్డు నిర్మాణం గురించి ఎమ్మెల్యే శివకుమార్ వినతికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఎస్సీ కాలనీల్లో శ్మశానవాటికల నిమిత్తం రూ.9 కోట్లను కేటాయిస్తున్నట్టు హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. మున్సిపాలిటీకి నూతన భవనం కోసం రూ.15 కోట్లు, షాదీఖానాకు రూ.4 కోట్లు, కొల్లిపరలో మినీ మార్కెట్ యార్డుకు స్థల సేకరణ కోసం రూ.5 కోట్లు, దావులూరు–కొల్లిపర మధ్య డబుల్‌లైన్ రహదారి, సెంట్రల్ లైటింగ్‌కు రూ.10 కోట్లు చొప్పున మొత్తం రూ.43 కోట్లను కేటాయిస్తున్నట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా సభికుల నుంచి హర్షధ్వానాలు మిన్నంటాయి.

సీఎం వైఎస్ జగన్‌కు ఘన స్వాగతం



ముఖ్యమంత్రి కాన్వాయ్‌పై పూలవర్షం కురిపిస్తున్న, బారులుతీరిన ప్రజలు



రైతు లబ్ధిదారులతో దిగిన ఫొటోను సీఎంకు బహూకరిస్తున్న మంత్రి రజని, కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

తెనాలిఅర్బన్: తెనాలి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు మంగళవారం ఉదయం ఘన స్వాగతం పలికారు. తాడేపల్లి నుంచి సీఎం ప్రత్యేక హెలికాప్టర్‌లో ఉదయం 10:05 గంటలకు కవిరాజ నగర్‌లోని హెలిప్యాడ్‌లో దిగారు. హెలిప్యాడ్ వద్ద మంత్రులు విడదల రజిని, అంబటి రాంబాబు, డాక్టర్ మేరుగ నాగార్జున, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఎస్పీ ఆరీఫ్‌హఫీజ్, తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, ఆయన కుమారుడు అన్నాబత్తుని సత్యనారాయణ, ఎమ్మెల్యేలు కిలారి రోశయ్య, మేకతోటి సుచరిత, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, షేక్ ముస్తఫా, ఎంపీలు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, మోపిదేవి వెంకట రమణారావు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా, ఎమ్మెల్సీలు డొక్కా మాణిక్యవరప్రసాద్, లేళ్ల అప్పిరెడ్డి, జంగా కృష్ణమూర్తి, ఎమ్మెల్సీ అభ్యర్థులు మర్రి రాజశేఖర్, చంద్రగిరి యేసురత్నం, టీటీడీ పాలక మండలి సభ్యుడు దాసరి కిరణ్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకుడు కత్తెర సురేష్ కుమార్, కారుమూరి వెంకటరెడ్డి, తాడిశెట్టి మురళి, మర్రెడ్డి శివరామకృష్ణారెడ్డి, గుదిబండి చినవెంకటరెడ్డి, బత్తుల బ్రహ్మానందరెడ్డి, డాక్టర్ నన్నపనేని సుధ దంపతులు, వివిధ కార్పొరేషన్‌ల డైరెక్టర్‌లు సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు. ఉదయం 10:38 గంటలకు ప్రత్యేక బస్సులో మార్కెట్ యార్డులోని సభా వేదిక వద్దకు వెళ్లారు. సభ అనంతరం అక్కడి నుంచి 12:50 గంటలకు హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు. అక్కడ ఉన్న వైఎస్సార్ సీపీ నాయకులను ఒక్కొక్కరిని సీఎం జగన్ కలిసి మాట్లాడారు. మధ్యాహ్నం 2:05 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో తాడేపల్లి బయలుదేరి వెళ్లారు.

మంచి ఫలితాల సాధనకు కృషి చేయాలి

డీఈఓ మేకతోటి వెంకటప్పయ్య

శావల్యాపురం: పదో తరగతి విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) మేకతోటి వెంకటప్పయ్య అన్నారు. శావల్యాపురంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను డీఈఓ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. పదో తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధిస్తున్న తీరును స్వయంగా పరిశీలించారు. డీఈఓ మాట్లాడుతూ ఏప్రిల్ 3వ తేదీ నుంచి జరిగే పదో తరగతి పరీక్షలకు రంగం సిద్ధం చేశామన్నారు. జిల్లాలో 24,441 మంది విద్యార్థులు ఫైనల్ పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. నెల రోజుల ముందు నుంచే ప్రతి విద్యార్థికి పోషకాహారంతోపాటు జగనన్న విద్యా మెటీరియల్ అందజేశామన్నారు. పదో తరగతి విద్యార్థులను సబ్జెక్టు, గ్రేడుల వారీగా విభజించి నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులందరూ సమన్వయంతో కృషి చేయాలని కోరారు. ఈ ఏడాది శావల్యాపురం హైస్కూల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు డీఈఓ వెల్లడించారు. జర్నలిస్టులకు ప్రభుత్వపరంగా ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజు రాయితీ వర్తిస్తుందన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. ఆయనతోపాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాలాది శ్రీనివాసరావు, పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.



శావల్యాపురం హైస్కూల్లో ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న డీఈఓ వెంకటప్పయ్య

గిరిజన వసతి గృహాల్లో మెరుగైన సౌకర్యాలు

విజయపురిసౌత్: గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ అధికారిణి వరలక్ష్మి తెలిపారు. విజయపురిసౌత్‌లోని గిరిజన సంక్షేమ వసతి గృహాన్ని మాచర్ల జెడ్పీటీసీ సభ్యులు మల్లు స్వామి తో కలిసి ఆమె మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలో స్వచ్ఛభారత్‌లో భాగంగా నూతనంగా నిర్మిస్తున్న మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల హాస్టల్‌ను సందర్శించారు. వసతి గృహంలో విద్యార్థులకు అందే సౌక ర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. డీటీడబ్ల్యూ ఓ వరలక్ష్మి మాట్లాడుతూ వసతి గృహంలో మెయిన్‌గేటు, ప్రహరీ నిర్మించేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపనున్నట్లు తెలిపారు. హాస్టల్‌లో సిబ్బంది కొరత ఉందని స్థానికులు డీటీడబ్ల్యూఓ దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం ఎత్తిపోతల ఆశ్రమ బాలికల పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థినులు తలపెట్టిన వైజ్ఞానిక ప్రదర్శనను సందర్శించారు. ఆమె వెంట ఎంపీడీవో కోటేశ్వరరావు, విజయపురిసౌత్ గిరిజన వసతి గృహం వార్డెన్ జాక్వెల్, మాచర్ల గిరిజన ఆశ్రమ వసతి గృహం వార్డెన్ ఎం రామ్మోహన్‌రావు, ఎత్తిపోతల గిరిజన ఆశ్రమ పాఠశాల ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం టి వెంకటేశ్వర్లు, చెంచుకాలనీ గిరిజన పాఠశాల హెచ్ఎం బ్రహ్మయ్య, ఎమ్మార్పీఎస్ నాయకుడు ఊరే మార్కు తదితరులు ఉన్నారు.



విజయపురిసౌత్‌లోని గిరిజన వసతి గృహం మరుగుదొడ్లను పరిశీలిస్తున్న డీటీడబ్ల్యూఓ వరలక్ష్మి

నేటి నుంచి లబ్ధిదారులకు ఉచితంగా బియ్యం పంపిణీ

నరసరావుపేట: జిల్లాలోని రేషన్‌కార్డుదారులకు మార్చి మాసానికి సంబంధించి ఒకటో తేదీ నుంచి రెగ్యులర్ పీడీఎస్ బియ్యం ఎండీయూ ఆపరేటర్ల ద్వారా ఉచితంగా పంపిణీ చేస్తారని జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ.శ్యామ్‌ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పంచదార, కందిపప్పు నిర్ణీత ధరలకు పొందాలని సూచించారు. ఎండీయూ వాహనదారులు లబ్ధిదారుల ఇళ్లవద్దకే వచ్చి ప్రతి రోజూ ఉదయం ఏడుగంటల నుంచి బియ్యం, నిత్యావసరాలను పంపిణీ చేస్తారన్నారు. తెలుపురంగు కార్డుదారులకు సార్టెక్స్ బియ్యం ఒక్కొక్కరికి ఐదుకేజీల చొప్పున, ఏఏవై కార్డుదారులకు కార్డు ఒక్కింటికి 35 కిలోల చొప్పున ఉచితంగా అందజేస్తారన్నారు. కందిపప్పు ఒక కేజీ చొప్పున, పంచదార తెలుపురంగు కార్డుదారులకు అరకేజీ, ఏఏవై కార్డుదారునికి ఒక కేజీ చొప్పున నిర్ణీత ధరకు పంపిణీ చేస్తారన్నారు. కార్డుదారులు తీసుకున్న బియ్యం వేరేవారికి విక్రయిస్తే వారి కార్డును రద్దుచేయటంతోపాటు వారిపై క్రిమినల్ కేసు చర్యలు తీసుకుంటామన్నారు. కొనుగోలు దారులు కూడా క్రిమినల్ కేసు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

దొంగతనాలకు పాల్పడిన వ్యక్తులు అరెస్టు

మారణాయుధాలు స్వాధీనం చేసుకున్న పోలీసులు

గురజాల: మారణాయుధాలతో బెదిరించి పలు దొంగతనాలకు పాల్పడిన వ్యక్తులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ బెజవాడ మెహర జయరాం ప్రసాద్ చెప్పారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ దాచేపల్లి మండలానికి చెందిన తమ్మిశెట్టి సాగర్‌బాబు, షేక్ ఆజాద్ అలీ, వల్లనీరు ఉదయ్‌కుమార్, గురజాల మండలం చర్లగుడిపాడు గ్రామానికి చెందిన అనుముల ఆంజనేయులు సులువు మార్గంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే అత్యాశతో పథకం పన్నారు. ఈ పథకంలో భాగంగా నడికూడి ముగ్గుమిల్లులో పని చేస్తున్న ఒక వ్యక్తిని అడగ్గా అతను బీహార్ నుంచి తుపాకీ తీసుకుని వచ్చి రూ.20,000 నిందితులకు ఇవ్వగా ఆ తుపాకీతో ఫిబ్రవరి 5వ తేదీన పిడుగురాళ్లలో చెరువు కట్ట బజారులో బెదిరించి మహిళ మెడలోని బంగారు నానుతాడును, ఫిబ్రవరి 10వ తేదీన పిల్లుట్ల గ్రామ సమీపంలో ద్విచక్రవాహనంపై ఒక మగ, ఒక ఆడ మనిషి వెళ్తుండగా వారిని నిలుపుదల చేసి బెదిరించి మహిళ మెడలో ఉన్న బంగారు నాంతాడు లాక్కుని పరారయ్యారు. ఫిబ్రవరి 11వ తేదీన తక్కెళ్లపాడు సమీపంలో భార్యాభర్తలు స్కూటీపై వెళ్తుండగా వారిని అడ్డగించి మహిళ మెడలో బంగారు గొలుసు, రింగుల చంద్రహారం లాక్కుని వెళ్లారు. ఫిబ్రవరి 23వ తేదీ గురజాల మాడుగుల రోడ్డులో మహిళ మెడలో బంగారు చైన్‌ను లాగి తీసుకెళ్లినట్లు వీరిపై కేసులు నమోదైనట్లు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు పులిపాడు అడ్డరోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానం రావడంతో నిందితుల వాహనాన్ని పరిశీలించగా కత్తులు, తపంచా, గన్ ఉన్నట్లు గుర్తించి వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిందితులను విచారించగా పై కేసుల్లో నిందితులుగా ఉన్నట్లు విచారణలో ఒప్పుకున్నారు. నిందితులు వెళ్తున్న వాహనంతోపాటు తపాంచా, పెద్ద కత్తులు, ఎయిర్ పిస్టల్, ఎయిర్ రైఫిల్ పిల్లెట్స్, రెండు స్ప్రే బాటిళ్లు స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. సమావేశంలో సీఐ కె ప్రభాకర్, ఎస్ఐలు అశోక్, బి.అనంతకృష్ణ, స్టాలిన్, కోటేశ్వరరావు తదితరులున్నారు. ఈ కేసులో మంచి ప్రతిభ కనబరచిన ఎస్ఐ, సిబ్బంది ఏడుకొండలు, రాజులను డీఎస్పీ అభినందించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ మెహర జయరాం ప్రసాద్

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 549.80 అడుగుల వద్ద ఉంది. ఇది 209.3374 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకి 10,500, ఎడమకాలువకు 9,257, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 31,898, ఎస్ఎల్‌బీసీకి 2,200, వరదకాలువకు 320 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 54,175 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 23,647 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 823.40 అడుగుల వద్ద ఉంది. ఇది 43.4775 టీఎంసీలకు సమానం.

పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 42.6707 టీఎంసీలు ఉండగా ప్రాజెక్టు ఎగువ నుంచి 32717 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. దిగువకు 3200 క్యూసెక్కులు వదులుతున్నారు.

సోషల్ మీడియాలో వందతులు నమ్మొద్దు

నగరంపాలెం: తెనాలిలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కార్యక్రమానికి వెళ్లనీయకుండా జనసేన నాయకులు, కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారని సోషల్ మీడియాలో వస్తున్న వదంతులును నమ్మవద్దని జిల్లా ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్రమంలో గృహనిర్బంధం, ముందస్తు అరెస్టులు ఎవరిని చేయలేదని ఆయన స్పష్టం చేశారు.

గ్రామ సచివాలయ ఉద్యోగులకు ప్రొబేషన్ డిక్లేర్ చేయండి

గుంటూరు వెస్ట్: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు, వీఆర్ఏల నుంచి వీఆర్వోలుగా పదోన్నతులు పొందిన ఉద్యోగులకు ప్రొబేషన్ డిక్లేర్ చేసి పేస్కేలు అమలు చేయాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు సయ్యద్ చాంద్ బాషా జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్రశేఖరరావుకు విన్నవించారు. స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్వో చాంబర్‌లో మంగళవారం ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. రెండో నోటిఫికేషన్ ద్వారా నియమితులైన ఉద్యోగులు జిల్లాలో సుమారు 450 ఉన్నారని వినతిపత్రంలో సూచించారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘం నాయకులు వై.నాగేశ్వరరావు, కరీముల్లా షాఖాదరి, భరత్‌కుమార్, కోటా సాహెబ్, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.



డీఆర్వో చంద్రశేఖరరావుకు వినతిపత్రం అందజేస్తున్న చాంద్‌బాషా, ఉద్యోగ సంఘ నాయకులు

ప్యాకేజీ డబ్బుల కోసం చిల్లర రాజకీయాలు

- మాచర్ల టీడీపీ ఇన్‌చార్జి బ్రహ్మారెడ్డివి బ్రహ్మానందం కామెడీలు
- పల్నాడుకు చెడ్డపేరు తెస్తున్నాడు
- ప్రభుత్వ విప్, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

సాక్షి, నరసరావుపేట: చంద్రబాబు పంపే ప్యాకేజీ డబ్బుల కోసమే మాచర్ల టీడీపీ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నాడని ప్రభుత్వ విప్, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి విమర్శించారు. టీడీపీకి చెందిన రౌడీల దాడిలో గాయపడి నరసరావుపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్ సీపీ కార్యకర్త చిరుమామిళ్ల శ్రీకాంత్‌ను మంగళవారం రాత్రి పీఆర్‌కే పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ టీడీపీ అధిష్టానం పంపే డబ్బులతో డీజిల్ కొట్టించుకొని మాచర్లకు వచ్చిన ప్రతిసారి బ్రహ్మారెడ్డి ఏదో ఒక వివాదం సృష్టిస్తున్నారన్నారు. అందులో భాగంగానే సోమవారం శ్రీకాంత్‌పై జరిగిన దాడి కూడా బ్రహ్మారెడ్డి తన మనుషులతో గొడవపెట్టించి గాయపరచారన్నారు. మొన్న ట్రాక్టర్ కాల్చారంటూ వివాదం అదే కోవకు చెందినదని అన్నారు. నిత్యం ఏదో ఒక విషయంలో చిల్లర రాజకీయాలు చేసి పల్నాడుకు చెడ్డపేరు తెస్తున్నారన్నారు. మాచర్లలో గొడవలు చేయడం గుంటూరు పారిపోయి విషప్రచారం చేయడం బ్రహ్మారెడ్డికి అలావాటుగా మారిపోయిందన్నారు. చంద్రబాబు టికెట్ ఇస్తే 2024 ఎన్నికల్లో నాతో పోరాడి గెలవాలి తప్ప ఇలా బ్రహ్మానందం కామెడీలు చేయకూడదని హితవు పలికారు. గతంలో రెండు సార్లు తనకు సహాయం చేసిన ఓ సామాజిక వర్గాన్ని ఎన్నికల ఓటమి తర్వాత నానామాటలు అన్న చరిత్ర బ్రహ్మారెడ్డిదని, ఇప్పుడు మళ్లీ అవసరం కొద్ది వారిని రాజకీయాలకు వాడుకోవాలని చూస్తున్నాడన్నారు. అన్నంపెట్టిన సొంత రక్తసంబంధీకులనే చంపిన చరిత్ర బ్రహ్మారెడ్డిదని వ్యాఖ్యానించారు. మేము ఎన్నికలతో సంబంధం లేకుండా ప్రతి వర్గాన్ని దగ్గరకు తీస్తాం. అది వైఎస్సార్ నుంచి మేము నేర్చుకున్నాం అన్నారు.



నరసరావుపేటలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చిరుమామిళ్ల శ్రీకాంత్‌ను పరామర్శిస్తున్న మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

ఎస్ఐ ప్రిలిమ్స్ ఫలితాల్లో 'రాంకీ' అభ్యర్థుల ప్రతిభ

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ఎస్ఐ పోస్టుల ప్రిలిమ్స్ ఫలితాల్లో రాంకీ ఫౌండేషన్ ప్రభంజనం సృష్టించినట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు ఎంపీ రామిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాంకీ ఫౌండేషన్‌లో ఉచిత శిక్షణ పొందిన అభ్యర్థులు మంచి ఫలితాలను సాధించారని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 39 శాతం మంది ఉత్తీర్ణులు కాగా, రాంకీ ఫౌండేషన్‌లో ఉచిత శిక్షణ పొందిన వారిలో 84 శాతం మంది ప్రిలిమ్స్ ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ఈసందర్భంగా తమకు ఉచిత శిక్షణతో పాటు పౌష్టికాహారాన్ని అందిస్తూ ఉత్తమ ఫలితాల సాధన దిశగా ప్రోత్సహించిన రాంకీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డికి ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు కృతజ్ఞతలు తెలిపారు.



ఆళ్ల అయోధ్య రామిరెడ్డి

కారు ఢీకొని విద్యార్థి మృతి

నకరికల్లు: రోడ్డు పక్కన రిక్షాపై కూర్చున్న బాలుడిని అతివేగంగా వస్తున్న కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అద్దంకి–నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారిపై తహసీల్దార్ కార్యాలయం సమీపంలో మంగళవారం ఈ సంఘటన జరిగింది. స్థానిక ఎస్టీకాలనీకి చెందిన మోరా నాగార్జునరెడ్డి (14) తన తల్లితోపాటు పొలానికి వెళ్లాడు. పొలంలో తనతల్లి గడ్డి కోస్తుండగా రోడ్డు పక్కనే రిక్షా పెట్టుకొని దానిపై కూర్చొని ఉన్నాడు. పిడుగురాళ్ల వైపు నుంచి నకరికల్లు వైపు అతివేగంగా వస్తున్న కారు రిక్షాను బలంగా ఢీకొట్టింది. బాలుడు ఎగిరి రోడ్డుపక్కన పడిపోయాడు. తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కారు ముందుభాగం, రిక్షా ధ్వంసమయ్యాయి. విషయం తెలుసుకొని మృతుని బంధువులు, స్థానికులు పెద్దసంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. మోరా శ్రీనివాస రెడ్డి, అనంతలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు కాగా మృతుడు పెద్దవాడు. స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ప్రమాదానికి కారణమైన కారులో ఉన్న వారు మద్యం సేవించి ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు.



మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లిదండ్రులు, బంధువులు

వృత్తి కోర్సుల్లో మహిళలకు శిక్షణ

నెహ్రూనగర్: టైలరింగ్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సుల్లో మహిళలకు మహిళా ప్రాంగణంలో ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మహిళా ప్రాంగణం మేనేజర్ కృష్ణవేణి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 18 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాలలోపు వయసు కలిగి 10వ తరగతి చదివిన వారు అర్హులన్నారు. ఆసక్తి గలిగిన అభ్యర్థులు మార్చి 10వ తేదీలోగా మహిళా ప్రాంగణం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

చెట్టును ఢీకొన్న కారు

డ్రైవర్ మృతి

రాజుపాలెం: నిద్రమత్తులో ఉన్న కారు డ్రైవర్ రోడ్డు మార్జిన్‌లో ఉన్న చెట్టును అతివేగంతో ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన మండలంలోని అనుపాలెం సమీపంలోని నిదానంపాటి అమ్మవారి గుడి వద్ద మాచర్ల–గుంటూరు రహదారిపై సోమవారం అర్ధరాత్రి జరిగింది. గుంటూరు సమీపంలోని నల్లపాడుకు చెందిన చంద్రగిరి సాంబశివరావు (35) తుమ్మలచెరువులో ఉన్న భార్య మంగమ్మ, ఇద్దరు పిల్లలను చూసేందుకు కారులో బయలుదేరాడు. మార్గంమధ్యలో నిద్రమత్తులో ఉండడంతో రోడ్డు పక్కనే ఉన్న రావిచెట్టుకు గుద్దుకుని అక్కడికక్కడే మృతి చెందాడు. అర్ధరాత్రి కావడంతో ఎవ్వరూ గమనించలేదు. మంగళవారం ఉదయం అనుపాలెం గ్రామస్తులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ షఫీ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ప్రభుత్వం వైద్యశాలకు తరలించారు.

కోల్డ్ స్టోరేజీలో మిర్చి నిల్వ చేసే రైతులకు రుణాలు

డీసీసీబీ ఛైర్మన్ లాలుపురం రాము

కొరిటెపాడు(గుంటూరు): కోల్డ్‌స్టోరేజీలలో పంట నిల్వ చేసుకునే మిర్చి రైతులకు రుణాలు మంజూరు చేయనున్నట్లు గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఛైర్మన్ లాలుపురం రాము పేర్కొన్నారు. బ్రాడీపేటలోని బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో కోల్డ్ స్టోరేజీల ఓనర్స్‌తో మంగళవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ ఛైర్మన్ రాము మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రుణాలు ఇవ్వాలని నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. పంట నిల్వలో 40 శాతం వరకు రుణం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇతర జాతీయ బ్యాంకుల కన్నా రైతులకు తక్కువ వడ్డీ(10 శాతం)కే రుణాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. మిర్చితో పాటు పసుపు, మొక్కజొన్న, జొన్న, ధాన్యం నిల్వ చేసుకునే రైతులకు కూడా తక్కువ వడ్డీకే రుణాలు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో డీసీసీ బ్యాంక్ సీఈఓ టి.కృష్ణవేణి, ది గుంటూరు చిల్లీస్ మర్చంట్స్ దిగుమతిదారుల అసోసియేషన్ ప్రెసిడెంట్ లేళ్ల పెద అప్పిరెడ్డి, డీసీసీబీ జీఎం శేషభాను పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీసీబీ ఛైర్మన్ లాలుపురం రాము పక్కన కృష్ణవేణి, శేష భాను తదితరులు

కాజా టోల్ ప్లాజాకు వినియోగదారుల కమిషన్ వడ్డింపు

రూ.55,820 చెల్లించాలని ఆదేశం

గుంటూరు లీగల్: నెలవారీ మొత్తాన్ని ముందస్తుగానే చెల్లించినప్పటికీ ఖాతా నుంచి అదనంగా తీసుకున్న నగదును బాధితునికి తిరిగి జమ చేయనందున నష్ట పరిహారంగా రూ.55,820 చెల్లించాలని కాజా టోల్ ప్లాజా వారిని వినియోగదారుల కమిషన్ మంగళవారం ఆదేశించింది. స్థానిక చంద్రమౌళి నగర్‌లో నివాసం ఉంటున్న కె.శివకుమారికి మారుతీ రిడ్జ్ కారు ఉంది. ఆ కారుకు టోల్ ప్లాజాకు లోకల్ లిమిట్స్ కింద నెలవారీ రూ.150 చెల్లించి వెహికల్ పాస్ తీసుకున్నారు. దీనికిగానూ ప్రతి నెలా రూ.150 చొప్పున టోల్ ప్లాజాకు జమయ్యేలా తమ ఐసీఐసీఐ బ్యాంకు ఖాతాలో కొంత నగదు జమ చేశారు. ఏడాదికి ఒకసారి నివాస ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. 2020 జూలై 31న ధ్రువీకరణ పత్రాలు టోల్ ప్లాజా వారికి సమర్పించారు. కానీ ఆమె కారుకు నెలవారీ పాస్ ఛార్జీలతో పాటు, జనరల్ చార్జీల కింద రూ.2,820 కట్ అయ్యాయి. ఈ విషయాన్ని టోల్ ప్లాజా, బ్యాంక్ వారి దృష్టికి ఆమె తీసుకెళ్లారు. జరిగిన పొరపాటును సరిచేసి, అదనంగా కట్ అయిన డబ్బులను తిరిగి తన ఖాతాకు జమ చేయాలని కోరారు. కానీ వారు ఏ సమాధానం ఇవ్వకపోవడంతో శివకుమారి గుంటూరు జిల్లా వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇద్దరి వాదనలు విన్న కమిషన్ అధ్యక్షురాలు తాటికొండ సునీత, కమిషన్ సభ్యులు కె.విజయలక్ష్మి, జి.పున్నారెడ్డి తీర్పును వెలువరిస్తూ ఫిర్యాది శివకుమారికి నష్టపోయిన 2,820, నష్ట పరిహారం కింద రూ.50 వేలు, ఫిర్యాదు ఖర్చుల కింద రూ.3 వేలు మొత్తం 55,820 ఆర్నెలల్లో చెల్లించాలని టోల్ ప్లాజా వారిని ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా చెల్లించకపోతే 9 శాతం వడ్డీతో చెల్లించాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొన్నారు. ఫిర్యాదుదారు తరఫున కట్టా హరినాథరాజు వాదించారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా, నా క్లయింట్లయిన శ్రీ రేపాల అంతయ్య తండ్రి శేషయ్య మరియు శ్రీ చీదళ్ళ చంద్రశేఖర్ తండ్రి వెంకటరామయ్య, ఇరువురి నివాసం మిర్యాలగూడ పట్టణం, నల్లగొండ జిల్లా గార్ల సూచనల మేరకు ఈ ప్రకటన జారీ చేయనైనది. నా క్లయింట్లు ఈ దిగువ షెడ్యూల్లో చూపిన ఆస్తిని (1) N.V.R. కాటన్ జిన్నింగ్ మిల్స్, రుద్రవరం @ రుద్రారం, మిర్యాలగూడ మండలం, నల్లగొండ జిల్లా, అను భాగస్వామ్య సంస్థ తరఫున మేనేజింగ్ పార్టనర్, శ్రీ కందుల శ్యాంసుందర్ రెడ్డి తండ్రి వెంకట్ రెడ్డి, నివాసం దామరచర్ల గ్రామం & మండలం, నల్లగొండ జిల్లా (2) గురులక్ష్మి కాటన్ జిన్నింగ్ మిల్స్, రుద్రవరం @ రుద్రారం, మిర్యాలగూడ మండలం, నల్లగొండ జిల్లా, అను భాగస్వామ్య సంస్థ తరఫున మేనేజింగ్ పార్టనర్, శ్రీ కటికం సైదులు రెడ్డి తండ్రి మల్లారెడ్డి, నివాసం వీర్లపాలెం గ్రామం, దామరచర్ల మండలం, నల్లగొండ జిల్లా గార్ల నుండి కొనుగోలు చేయుటకు నిర్ణయించుకొని కొనుగోలు ధనంలో కొంత మొత్తాన్ని బయాన పూర్వకంగా చెల్లించి విక్రయ అగ్రిమెంట్ గావించుకున్నారు.

సదరు షెడ్యూల్ ఆస్తిలో, N.V.R. కాటన్ జిన్నింగ్ మిల్స్ అను భాగస్వామ్య సంస్థ ఎ. 02-24 గుంటల భూమిని, సదరు భాగస్వామ్య సంస్థ శ్రీ నాదెండ్ల లక్ష్మీనారాయణ తండ్రి చిన వెంకటేశ్వర్లు, నివాసం గుంటూరు పట్టణం మరి నల్గురు భాగస్వాముల (పార్టనర్స్)తో కలిసి సంస్థను స్థాపించి, అట్టి సంస్థ పేరున రిజిస్ట్రీ కొనుగోలు దస్తావేజు నెం. 2202/2015 అను దాని ద్వారా కొనుగోలు చేసి అందులో జిన్నింగ్ మిల్ ఏర్పాటు కోసం, రుద్రారం గ్రామ పంచాయతి నుండి అనుమతి పొంది, భవన నిర్మాణాలు గావించగా, సదరు గ్రామ పంచాయతి వారు అట్టి భవనానికి డోర్ నెం. 4-29/1, ఏర్పాటు చేసినారు. అదే విధంగా షెడ్యూల్ ఆస్తిలో, గురులక్ష్మి కాటన్ జిన్నింగ్ మిల్స్ అను భాగస్వామ్య సంస్థ ఎ. 02-12 గుంటల భూమిని సదరు భాగస్వామ్య సంస్థ శ్రీ నాదెండ్ల గురువేశ్వర్ రావు తండ్రి చిన వెంకటేశ్వర్లు, నివాసం గుంటూరు పట్టణం మరి ఇద్దరు భాగస్వాముల (పార్టనర్స్) తో కలిసి సంస్థను స్థాపించి, అట్టి సంస్థ పేరున రిజిస్ట్రీ కొనుగోలు దస్తావేజు నెం. 2200/2015 అను దాని ద్వారా కొనుగోలు చేసి అందులో జిన్నింగ్ మిల్ ఏర్పాటు కోసం, రుద్రారం గ్రామ పంచాయతి నుండి అనుమతి పొంది, భవన నిర్మాణాలు గావించగా, సదరు గ్రామ పంచాయతి వారు అట్టి భవనానికి డోర్ నెం. 4-29 ఏర్పాటు చేసినారు. అంతేకాకుండా సదరు రెండు భాగస్వామ్య సంస్థలు ఉమ్మడిగా షెడ్యూల్ ఆస్తిలో ఎ. 0-20 గుంటల భూమిని రిజిస్ట్రీ కొనుగోలు దస్తావేజు నెం. 2201/ 2015 అనుదాని ద్వారా కొనుగోలు చేసి ఉమ్మడిగా రెండు భాగస్వామ్య సంస్థల అవసరార్థం ఖాళీ స్థలంగా ఉమ్మడి హక్కులతో అనుభవిస్తున్నారు. ఇట్టి మూడు విస్తీర్ణాల భూములు, అందులోని రెండు సంస్థల కట్టుబడులు ప్రక్క ప్రక్కనే యుండి ఏక ఖండంగా ఏర్పడివని. సదరు మూడు విస్తీర్ణాలను, సదరు రెండు భాగస్వామ్య సంస్థలు పైన తెలియజేసిన రిజిస్ట్రీ కొనుగోలు దస్తావేజుల ద్వారా శ్రీమతి బండి సౌమ్య భర్త యాదగిరి రెడ్డి, నివాసం ఈదులగూడెం, మిర్యాలగూడ పట్టణం గారి నుండి కొనుగోలు చేయగా సంక్రమించినదని, మరియు సదరు బండి సౌమ్య గారికి నూనె సాయి ప్రసాద్ తండ్రి అమ్మిరాజు మరియు నూనె పద్మజ భర్త సుబ్బారావు నివాసం మిర్యాలగూడ అనువారల నుండి రిజిస్ట్రీ కొనుగోలు దస్తావేజు నెం. 3093/2010 అను దాని ద్వారా సంక్రమించినదని, మరియు వారి అమ్మకందారులైన నూనె సాయి ప్రసాద్ & నూనె పద్మజ గార్లకు మిర్యాలగూడ మండలం కొత్తగూడెం గ్రామ కాపురస్తులైన జొన్నలగడ్డ రంగారెడ్డి తండ్రి కోటి రెడ్డి మరియు జొన్నలగడ్డ వనజాత భర్త రంగా రెడ్డి గార్ల నుండి రిజిస్ట్రీ కొనుగోలు దస్తావేజు నెం. 2675/2008 & 2676/2008 అను వాని ద్వారా సంక్రమించినదని, నా క్లయింట్లకు తెలియజేసి అమ్ముచున్నారు. అంతే కాకుండా, సదరు రెండు భాగస్వామ్య సంస్థలలోని భాగస్వాముల చేరిక మరియు నిష్క్రమణ (రిటైర్మెంట్) ఎప్పటికప్పుడు చట్టబద్ధంగా జరిగి ఈ రోజు నాటికి ఉన్న సదరు రెండు భాగస్వామ్య సంస్థలలోని అందరు భాగస్వాముల ఏకగ్రీవ నిర్ణయం ప్రకారం షెడ్యూల్ ఆస్తిని అమ్ముచున్నట్లుగా సదరు రెండు భాగస్వామ్య సంస్థల మేనేజింగ్ పార్టనర్లు నా క్లైంట్లకు తెలియజేసి అమ్ముచున్నారు.

కావున, ఇట్టి కొనుగోలు వ్యవహారంలో ఎవరికైనను, ఏ విధమైన అభ్యంతరాలున్నను, ఈ ప్రకటన వెలువబడిన నాటి నుండి వారం రోజులలోపుగా సరైన సాక్ష్యాధారాలతో తెలియజేయవలసినదిగా కోరనైనది. గడువు తదుపరి వచ్చే అభ్యంతరాలు పరిగణలోకి తీసుకొనబడవు. గడువు లోపు ఏలాంటి అభ్యంతరాలు రాని యెడల, నా క్లయింట్లు సదరు కొనుగోలు వ్యవహారంలో ముందుకు సాగిపోవుదురు.

షెడ్యూల్ ఆస్తి : నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం రుద్రవరం @ రుద్రారం రెవిన్యూ గ్రామ శివారులో, గతంలో రుద్రారం గ్రామ పంచాయతి పరిధిలో చేరియున్నదై, ప్రస్తుతం లక్ష్మీపురం గ్రామ పంచాయతీ పరిధిలో చేరియుండి డోర్ నెం. 4-29/1 & 4-29 కలిగి సర్వే నెంబర్ 460/అ1 లో ఎ. 0-39 గుంటలు, సర్వే నెంబర్ 461/ఈ లో ఎ. 01-25 గుంటలు మొత్తం ఎ. 02-24 గుంటలు N.V.R. కాటన్ జిన్నింగ్ మిల్లుకు సంబంధించినదై, సర్వే నెంబర్ 461/ఈ లో ఎ. 0-39 గుంటలు, సర్వే నెంబర్ 461/ఈ1లో ఎ. 01-13 గుంటలు మొత్తం ఎ. 02-12 గుంటలు గురులక్ష్మి కాటన్ జిన్నింగ్ మిల్లుకు సంబంధించినదై, సర్వే నెంబర్ 460/అ1 లో ఎ. 0-17 గుంటలు, సర్వే నెం. 461/ఈ1 లో ఎ. 0-03 గుంటలు మొత్తం ఎ. 0-20 గుంటలు N.V.R. & గురులక్ష్మి కాటన్ జిన్నింగ్ మిల్లులకు ఉమ్మడిగా సంబంధించినదై, ఈ విధంగా మొత్తం ఎ. 05-16 గుంటల విస్తీర్ణం కలిగి ఈ క్రింది హద్దుల మధ్యన కలది.

ఉత్తరం : వద్దెర పెద్దయ్య గారి భూమి, దక్షిణం : NSP కాలువ మరియు కాలువ రోడ్డు, తూర్పు : గతంలో బండి సౌమ్య గారి భూమి, ప్రస్తుతం కటికం శంకర్ రెడ్డి, సైదులు రెడ్డి మరియు వనకూరి వెంకట్ రెడ్డి గార్ల భూమి, పడమర : గతంలో మైనంపాటి వెంకట్ రెడ్డి గారి భూమి, ప్రస్తుతం వెంకటేశ్వర రైస్ ఇండస్ట్రీస్ మరియు వంగాల సుధా రాణి గారి భూమి

స్థలం : మిర్యాలగూడ.
తేది. 27-02-2023

ఇట్లు : పి. రవీంద్రారెడ్డి, అడ్వకేట్,
MIG-11, హౌసింగ్ బోర్డు, మిర్యాలగూడ.
సెల్ : 90006 55365